క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ, చైర్మన్

ఆత్మకూరు: మహానందిక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మహేశ్వరరెడ్డి బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఇందిరేశ్వరం గ్రామంలో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణరెడ్డి, పార్టీ నాయకులు విజయచౌదరి, సురేష్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగలూటిలో అన్నదానం

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలక్షేత్రానికి కాలినడకన వెళ్లే శివస్వాములు, భక్తుల కోసం గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీశైల క్షేత్రానికి తరలి వెళ్లే భక్తులు అన్నప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆశీర్వాదం పొందాలని కోరారు.

ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

నందికొట్కూరు(పగిడ్యాల): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన ముఖ హాజరు (ఫేస్ రికగ్నైజేషన్ యాప్) నుంచి గ్రామ రెవెన్యూ అసిస్టెంట్‌లకు మినహాయింపు ఇవ్వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళావతికి వినతి పత్రం అందజేశారు. బుధవారం గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌ఐ కళావతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు మాబాషా, సుధాకర్, శివన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి


కమిటీ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కొమరంభీం చెంచుగిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం, నాయకులు కుడుముల వెంకటేశ్వర్లు, ధర్మా నాయక్, గోపాల్ నాయక్ బుధవారం ఏపీజెన్‌కో గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంబ రవి బాబుకు వినతిపత్రం అందించారు. మాణిక్యమ్మసెల, చెంచుగూడెంలో నివాసం ఉంటున్న గిరిజనులకు అటవీ భూహక్కుల చట్టం కింది ఇళ్లపట్టాలను మంజూరు చేసి గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. శ్రీశైల దేవస్థానం, అటవీశాఖల్లో పనిచేస్తున్న గిరిజన తాత్కాలిక ఉద్యోగులను వివిధ కారణాలతో కొంత మందిని తొలగించారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

లక్ష్యాలు సాధించాలి

మిడుతూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి ఉగాది నాటికి టార్గెట్‌లను పూర్తి చేయాలని ఆదేశించారు. వలంటీర్ల సహాయంతో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రత్యామ్నాయం 'అరటి'

- ఉద్యాన పంటలపై రైతుల ఆసక్తి
- ఎన్నడూలేని విధంగా అరటి సాగు
- లాభాలు గడిస్తున్న అన్నదాతలు
- రెండేళ్లలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం


వీరాపురం గ్రామ సమీపంలో సాగు చేసిన అరటి తోట

కొత్తపల్లి: వ్యవసాయమే జీవనాధారమైన రైతన్నలు అందులో నష్టం వచ్చినా, లాభం వచ్చిన కుంగిపోకుండా ముందుకు సాగుతున్నారు. మండలంలో వరి, మొక్కజొన్న, మిరప, మినుము, పెసర, పత్తి వంటి పంటలను రైతులు ఎక్కువగా సాగు చేసుకునేవారు. అయితే గత రెండేళ్లుగా రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించారు. హార్టీకల్చర్ అధికారులు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో పంటమార్పిడి చేసుకుంటూ పండ్ల తోటలను పెంచుతూ అధిక లాభాలు గడించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలో ఎన్నడూ లేనివిధంగా అరటి పంటను సాగు చేసుకుంటున్నారు.

70 ఎకరాల్లో సాగు

గతేడాది మండలంలోని బావాపురం గ్రామంలో కేవలం 5 ఎకరాల్లో మాత్రమే రైతులు అరటి పంటను సాగుచేశారు. అయితే ఈ ఏడాది హార్టీకల్చర్ అధికారులు పంటలపై, వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో రైతుల్లో మార్పువచ్చింది. ప్రస్తుతం సుమారు 70 ఎకరాల్లో అరటి మొక్కలు నాటారు. మండలంలోని వీరాపురం, బావాపురం, నందికుంట, దుద్యాల, ఎదురుపాడు, శివపురం, గుమ్మడాపురం గ్రామాల రైతులు అరటి పంట వైపు మొగ్గుచూపారు.

రూ.వేలల్లో ఖర్చు రూ.లక్షల్లో ఆదాయం

అరటి పంట 9 నుంచి 10 నెలల లోపు పూర్తి అవుతుంది. దీనిని సాగు చేసుకోవడంలో మెలకువలు పాటిస్తే లక్షల్లో ఆదాయం గడించవచ్చు. ఒక ఎకరానికి రూ.70వేల నుంచి 80 వేలు ఖర్చుచేస్తే సుమారు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. ఇతర పంటలు వేసి నష్టాలను చవిచూస్తున్న తరుణంలో ఉద్యానవన శాఖ అధికారుల అవగాహన కార్యక్రమాల ద్వారా అన్నదాతలు చైతన్యవంతులై ఈ రకమైన సాగువైపు అడుగులు వేస్తున్నారు.

ఎకరాకు రూ.1.5 లక్ష లాభం వచ్చింది



మొదటి సంవత్సరం ఎకరంలో అరటి సాగు చేశా. దానికి సుమారు రూ.80 వేల దాకా ఖర్చు అయ్యింది. ఖర్చులు అన్నీ పోగా సుమారు రూ.1.5 లక్షల వరకు లాభం వచ్చింది. ఇప్పుడు 2 ఎకరాల్లో అరటి సాగుచేస్తున్న. పంట బాగానే ఉంది.

– కె.రమణారెడ్డి, రైతు, బావాపురం గ్రామం

అధిక దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా



నేను ఈ ఏడాది 3 ఎకరాల్లో అరటి సాగుచేస్తున్నా. మొక్కలు ఏపుగా పెరిగాయి. పంట కూడా బాగా ఉంది. కాపుదశలో ఉంది. అరటి గెలలు బాగానే పెరుగుతున్నాయి. అధిక దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా.

– రామకృష్ణారెడ్డి, రైతు వీరాపురం గ్రామం

ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోవాలి



మండలంలో అన్ని గ్రామాలలో రైతులకు ఉద్యాన పంటలు, వాటి ఆవశ్యకత, వాటిని సాగుచేస్తే వచ్చే లాభాలపై అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది హార్టీకల్చర్ వ్యవసాయ పద్ధతులపై మక్కువ చూపుతున్నారు. అందులో భాగంగానే ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది అరటి సాగు చేస్తున్నారు. మరింత మంది రైతులు ముందుకు వచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

– హరినాథ్ రెడ్డి, ఉద్యానశాఖాధికారి, కొత్తపల్లి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పాములపాడు: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. బుధవారం స్థానిక జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ వలంటీర్లు బాధ్యతగా వ్యవహరిస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏఈ శివరామకృష్ణారెడ్డి, ఏపీఎం అనురాధ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన శిబిరం ఏర్పాటు

నందికొట్కూరు(పగిడ్యాల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివమాల ధరించి శ్రీశైలానికి వెళ్లే పాదయాత్రికులకు ఆత్మకూరు సమీపంలోని కరివేన ఎస్ఆర్‌బీసీ కాలనీ వద్ద ఉన్న శ్రీ సత్యసాయి సేవా సమితి ఆశ్రమంలో అన్నదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగసత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు ప్రతి రోజూ పది వేల మందికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని పాదయాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది: అధికారులు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శుభ్రపరచడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పదిహేను రోజులకోసారి శుభ్రపరచాలని ఆదేశించారు. బుక్కాపురంలోని మహిళా సమాఖ్య భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వైరల్ జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు అధికమవుతున్నాయని, వాటి నివారణపై దృష్టి సారించాలన్నారు. అధికారులు గ్రామాల పర్యటనలో గుర్తించిన సమస్యలను ప్రజాప్రతినిధుల సహకారంతో సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన రూ.63లక్షల నిధులతో పనులు చేస్తున్నామని, 80శాతం వరకు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించేందుకు అధికారులు సహకరించాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కుంచపు లక్ష్మీనరసమ్మ, బండి సరస్వతి, సర్పంచులు కందుల వరలక్ష్మమ్మ, శవ్వా శ్రీలక్ష్మి, గద్దం చంటి, సుదర్శనం, లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ జనార్దన్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు


రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామ సచివాలయ పరిధిలోని జడ్డువారి పల్లె శ్మశాన వాటికకు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రోడ్డు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు. బుధవారం రోడ్డును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సుమారు రూ.6లక్షల వ్యయంతో రహదారిని నిర్మించామన్నారు. అలాగే గ్రామంలో మరికొన్ని రోడ్లకు మరమ్మతులు చేయించామని చెప్పారు. పీఆర్ ఏఈ రామచంద్రయ్య ఉన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం సరిగా వండలేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరైన భోజనాన్ని వడ్డించకపోతే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైకుల వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం మోటారు సైకిళ్లకు నిర్వహించిన వేలం పాటలో రూ.1,11,668 ఆదాయం చేకూరింది. ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రత్నరాధిక సమక్షంలో 7 మోటారు సైకిళ్లకు వేలం పాట నిర్వహించారు. త్వరలో మోటారు సైకిళ్లకు సంబంధించిన పత్రాలను జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు వేలంలో దక్కించుకున్న వారికి అందజేస్తామని ఎస్‌ఐ అశోక్ వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ఎర్రన్న, పోలీసు సిబ్బంది, వీఆర్వో మూర్తుజావలి పాల్గొన్నారు.

నేడు బ్లాక్ డే పాటిద్దాం

నందికొట్కూరు(పగిడ్యాల): ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన బ్లాక్ డేగా పాటిద్దామని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు పకీర్‌సాహెబ్, పి.వెంకటేశ్వర్లు, భాస్కరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

నంద్యాల(అర్బన్): రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే విధంగా నేషనల్ సీడ్ కార్పొరేషన్ కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు తిరుపాల్ రెడ్డి సూచించారు. పట్టణంలోని నేషనల్ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉన్న విత్తనాల గోదాములను ఆయన బుధవారం ఏడీఏ రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఇందిరేశ్వరం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని ఇందిరేశ్వరం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరేశ్వరం చెంచుగూడేల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా యువకులను, ఇతర పార్టీ కార్యకర్తలను పలకరిస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామంలోని టీడీపీ నాయకులు తిరుపమయ్యను పలకరించి ఆయన కుటుంబానికి మంజూరైన సంక్షేమ పథకాలను వివరించారు. దాదాపు రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.3 లక్షలు వివిధ పథకాల ద్వారా వారి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, పక్కాగృహాలు, ఇళ్లస్థలాలు, విద్యుత్ పోల్స్‌లాంటి చిన్న చిన్నసమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ప్రజలందరూ కలిసి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేను గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. పెద్ద ఎత్తున మహిళలు పుష్పగుచ్ఛాలు అందించి పూలు చల్లుతూ ఘనస్వాగతం పలికారు. గిరిజన మహిళలు సైతం ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలకరించి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి, నాయకులు, శివారెడ్డి, మురళీ, విజయచౌదరి, శేషిరెడ్డి, సురేష్, రామకృష్ణారెడ్డి, శివనాయక్, రవి, శ్రీపతిరావుపేట సర్పంచ్ పుల్లారెడ్డి, హనుమంతరెడ్డి, బాలస్వామి యాదవ్, రషీద్, ప్రభాకర్‌రెడ్డి, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అపహరణ

మిడుతూరు: ఏపీ 39ఎస్ఎం8422 నంబరు గల ట్రాక్టర్, ట్రాలీ అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ మారుతీశంకర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. మిడుతూరు గ్రామానికి చెందిన రైతు మానికింది వెంకటరమణ వ్యవసాయ పనుల నిమిత్తం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ప్రతి రోజూ వ్యవసాయ పనులు ముగించుకుని ట్రాక్టర్‌ను నంద్యాల– నందికొట్కూరు రోడ్డును ఆనుకుని ఉన్న కల్లం దొడ్డిలో ఉంచేవాడు. అయితే మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను అపహరించారు. దీంతో ట్రాక్టర్ యజమాని వెంకటరమణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ట్రాక్టర్ ట్రాలీ నంబర్ ఏపీ 39ఎస్‌క్యూ7396గా నమోదు చేయబడిందని వెల్లడించారు. ట్రాక్టర్ ఆచూకీ తెలిస్తే వెంటనే మిడుతూరు ఎస్‌ఐ 9121101189 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మహానందికి నేడు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

మహానంది: ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవి బాబు గురువారం మహానందికి వస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటారన్నారు. చైర్మన్‌తో పాటు ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యాశంకర్ నాయక్ వస్తారన్నారు. దర్శనం అనంతరం మహానందిలోని గిరిజనులతో ముఖాముఖి నిర్వహిస్తారని, సమస్యలపై మాట్లాడతారని చెప్పారు.

నల్లమలలో ఎమ్మెల్యే పర్యటన


చేతిపంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరురూరల్: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బుధవారం ఆత్మకూరు అటవీ డివిజన్ లోని నల్లమల అడవుల్లో పలు ప్రదేశాలను ఆయన సందర్శించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా నల్లమల అడవుల గుండా వెళ్లే భక్తులకు సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా పెచ్చెరువు వెళ్లి అక్కడ నుంచి నాగలూటి వైపుగా పాదయాత్ర మార్గంలో పంగిడి బేస్ క్యాంప్ వరకు వెళ్లారు. దారి పొడుగునా ఆయన అంగళ్లు వేసుకున్న చెంచు గిరిజనులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దారి వెంట పాదయాత్రికులకు తాగునీటి సౌకర్యాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన శిబిరాల గురించి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ అలన్ చోంగ్ టెరాన్‌తో మహాశివరాత్రి పాదయాత్రికుల సౌకర్యాలపై వాకబు చేశారు. అటవీ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ జేయరాదని ఆదేశించారు. దారిలో ఉన్న ఒక బోరు పంపును స్వయంగా కొట్టి నీటి నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రాజమోహన్ రెడ్డి, విజయ్ చౌదరి, సురేష్, రషీద్, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ క్రిష్ణమూర్తి, రేంజర్లు దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మసీదుపురం లక్ష్మణ్, ఏపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేషు కోరారు. మహానందిలో బుధవారం వారు మాట్లాడుతూ దర్శనానికి వెళ్లే సమయంలో స్థానికులను టికెట్ల పేరుతో అడ్డుకోవడం సరికాదన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా టాయిలెట్ల సౌకర్యం కల్పించాలన్నారు. స్థానికులకు టోల్‌గేట్లు తీసుకోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ గౌడ్, ఎంఆర్‌పీఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి, మండల అధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి

పగిడ్యాల: ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించే సీబీఏ (క్లాస్ రూమ్ బేస్డ్ అసిస్‌మెంట్–2), ఫార్మేట్ అసిస్‌మెంట్ పరీక్షల్లో విద్యార్థులు సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంఈఓ సుభాన్ సూచించారు. బుధవారం మండల వ్యాప్తంగా 20 మండల పరిషత్, 2 ప్రాథమికోన్నత, 4 జిల్లాపరిషత్, ఆదర్శ, కస్తూర్బా, అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో సీబీఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీరవోలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పరీక్షల నిర్వహణను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. నాడు నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. హెచ్ఎం శివరామయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తప్పిన ప్రమాదం

మహానంది: గ్యాస్‌సిలిండర్లతో వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. భారత్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఆటో తిమ్మాపురం నుంచి బుక్కాపురం మార్గంలో గ్యాస్ సిలిండర్లతో వెళ్తుండగా గుంతలను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

జూపాడుబంగ్లా: స్వయం సహాయక పొదుపు మహిళల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని వైఎస్సార్ క్రాంతి పథం మండల ఏపీఎం అంబమ్మ వీఓఏలకు ఆదేశించారు. బుధవారం మండలంలోని తర్తూరు, మండ్లెం, తంగడంచ, భాస్కరాపురం గ్రామాలలోని పొదుపు సంఘాల పుస్తకాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహణలో లోపాలకు చోటివ్వరాదన్నారు. నెలనెలా మహిళల పొదుపు నిర్వహణ రికార్డులను సక్రమంగా నిర్వహించి రుణాల రికవరీలను సకాలంలో చెల్లించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నాగన్న, ఇస్మాయిల్, అకౌంటెంట్ రమేష్, వీఓఏలు తదితరులు ఉన్నారు.

అభివృద్ధే జగనన్న అజెండా

- గాంధీనగర్ ప్రాంత అభివృద్ధికి కృషి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


దివ్యాంగుడితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు(పగిడ్యాల):బడుగు,బలహీన వర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండాఅని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ సచివాలయం గాంధీనగర్ కాలనీలో రెండో రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తూ జగనన్న ఆ కుటుంబానికి చేసిన ఆర్థిక చేయూతను వివరించారు. మళ్లీ జగనన్నకు తమ ఆశీర్వాదాలు కావా లని చేతులు జోడించి వేడుకున్నారు. అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల పాలనలోనే ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శా తంకు పైగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపండి

మురుగు కాలువలు, కరెంట్ స్తంభాల కొరత, తాగునీటి ఎద్దడి, చెత్త సేకరణలో జాప్యం జరుగుతోందని ఇలా పలు సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యేతో ఏకరువు పెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కిశోర్‌కుమార్‌ను పిలిచి గడప గడపలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. గాంధీనగర్‌లో సీసీ రోడ్లు వేయించడానికి ప్రతిపాదనలను తయారు చేయాలని సూచించారు. గాంధీనగర్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. అలాగే చాబోలు నుంచి పాములపాడు మండలంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే 50 మంది విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ వాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరించాలని డిపో మేనేజర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. మరుగుజ్జులుగా ఉన్న వరలక్ష్మి, లక్ష్మీదేవి కవలలకు జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు కాగా, వారు గాంధీనగర్‌లోనే నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టారు. కవలలకు వారు నివశిస్తున్న చోటే ఇళ్లు నిర్మించుకోవడానికి సహకరించాలని హౌసింగ్ అధికారులకు, పార్టీ శ్రేణులకు సూచించారు. అధికారులు మానవత్వంతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, నందికొట్కూరు వ్యవసాయ పరిపతి సంఘం చైర్మన్ సగినేల ఉసేనయ్య, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ షూకూర్‌మియ్య, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రమాదేవి, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దిలీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మడపల్లి విక్టర్, రిటైర్డ్ ఎస్‌ఐ జాన్, శ్రీను, మహేష్, ముజీబ్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై సూపర్ చెక్


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ పీరునాయక్

మిడుతూరు: రబీ సీజన్‌లో పంట నమోదు వివరాలపై మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ సూపర్ చెక్ నిర్వహించారు. బుధవారం మండలంలోని కడుమూరు, మాసపేట గ్రామాల్లో సాగైన వేరుశనగ, శనగ పంటలను పరిశీలించి, వివరాలను క్రాస్ చెక్ చేశారు. అనంతరం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శృతి, ఉసేన్‌బాషా పాల్గొన్నారు.